సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 15 । మార్చి । 2025



టన్ను చీనీ రూ.23,750

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,750 పలికాయి. మార్కెట్‌కు 349 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా 5, సరాసరిన రూ.7 ప్రకారం ధర పలికింది.



పారాహుషార్



- మార్కెట్లో యథేచ్ఛగా నకిలీ, నాణ్యతలేని వస్తువుల విక్రయాలు
- గడువు మీరినా అంటగడుతున్న వైనం
- అప్రమత్తతతోనే అడ్డుకట్ట వేయొచ్చంటున్న వినియోగదారుల సంఘాలు
- తనిఖీలపై దృష్టిసారించని అధికారులు

సందర్భం : నేడు వినియోగదారుల దినోత్సవం



ఈ కందిపొడి ప్యాకెట్ గత నెలనే ఎక్స్‌పైరీ డేట్ అయిపోయింది. అయినా కూడా పుట్టపర్తిలోని మెయిన్ బజార్‌లోని ఓ సూపర్ మార్కెట్‌లో విక్రయానికి ఉంచారు. బిల్లు కౌంటరులో వెళ్లి కస్టమర్ అడిగితే.. అప్పుడు స్టాక్ లేవనే సమాధానం ఇచ్చారు. అలాగే 930 ఎంఎల్ ఉన్న వంట నూనె ప్యాకెట్లు వందల సంఖ్యలో ఉన్నాయి. ఆయిల్ ప్యాకెట్ ఏది తూకం వేసినా కిలో (కేజీ) రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. తాము ఇక్కడ తయారు చేయడం లేదని.. అన్నీ రెడీమేడ్ వస్తువులని నిర్వాహకులు సమాధానం ఇచ్చారు.



ఇవి పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ చిల్లర కొట్టులో అమ్ముతున్న తినుబండారాలు. ఏ ఒక్కదానిపై ఎప్పుడు ప్యాక్ చేశారు? ఎక్స్‌పైరీ డేట్ లాంటివి లేకుండానే ప్రయాణికులకు విక్రయిస్తున్నారు. వారు ఎంత రేటు చెప్పినా కొనాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.

సాక్షి, నెట్‌వర్క్: కొనే ప్రతి వస్తువులోనూ, సేవలోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉంది. అయితే ప్రస్తుతం మోసాలు ఎక్కువైపోయాయి. తాగే పాలు, నీళ్లలో కూడా నాణ్యత ఉండటం లేదు. తూకాల్లో భారీగా తేడాలు ఉంటున్నాయి. బ్రాండ్ పేరుతో నకిలీ వస్తువులు రాజ్యమేలుతున్నా.. అధికారులు మౌనం వహిస్తున్నారు. ఫిర్యాదు వచ్చిన రోజు తూతూ మంత్రంగా తనిఖీ చేసి జేబులు నింపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు కూడా మొక్కుబడిగా కార్యక్రమాలు చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో శుక్రవారం 'సాక్షి' విజిట్‌లో పలు మోసాలు బయటపడ్డాయి.

'మామూళ్ల మత్తు'లో వ్యవస్థలు..

కల్తీ, నాణ్యత, తూకాలు, గడువు మీరిన వస్తువులు. నకిలీ సరుకు, బ్రాండ్ పేరుతో దోపిడీ.. ఇలా ఇన్ని జరుగుతున్నా.. లీగల్ మెట్రాలజీ అధికారులు, డ్రగ్స్ కంట్రోలర్స్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వినియోగదారులు ఫిర్యాదులు ఇస్తే.. కానీ తనిఖీలు చేయడం లేదు. చేసినా నివేదిక ఏం తెలుస్తారో బయటికి చెప్పరు. నెలవారీ మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

ఇలా ఫిర్యాదు చేద్దాం..

వినియోగదారులు నష్టపోయామని భావిస్తే జిల్లాలో అయితే డీసీఐసీ, మండలాల్లో అయితే ఎంసీఐసీ ద్వారా కేవలం తెల్లకాగితంపై రాసి ఇస్తే సరిపోతుంది. అయితే కచ్చితంగా రసీదు ఉండాలి. విక్రయించే ప్రతి వస్తువుపైనా ఎంఆర్‌పీ తయారు చేసిన తేదీ, ఎక్స్‌పైరీ డేట్, వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు చెందిన నంబరు విధిగా ముద్రించి ఉండాలి. అలా లేకపోతే వస్తువుల విక్రయ దుకాణాలపై ప్రభుత్వం జరిమానా విధించాలి. అనుమతి లేకుండా సినిమా టికెట్లు అధిక ధరలకు అమ్మినా, తూకాల్లో తేడాలున్నా, సేవల్లో లోపాలను పసిగట్టినా ఫిర్యాదు చేయొచ్చు.

చట్టంపై అవగాహన అవసరం..

వినియోగదారుల రక్షణ చట్టం–2019 ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. నాణ్యత లేని ఉత్పత్తులు, తప్పుడు ప్రకటనలు, అధిక ధరలు, సరైన సేవలు అందకపోవడం వంటి సమస్యల నుంచి పరిహారం కోసం వినియోగదారులకు రక్షణ చట్టం అమల్లో ఉంది. మారుతున్న కాలానికి, సాంకేతిక సౌలభ్యానికి అనుగుణంగా ఈ–కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్‌పై నియంత్రణ ఈ చట్టంలో ఉంది.

- జిల్లా కమిషన్ ఎదుట కోటి రూపాయల లోపు
- రూ. కోటి నుంచి రూ.10 కోట్ల మధ్య రాష్ట్ర కమిషన్ ఎదుట
- రూ.10 కోట్ల పైబడిన కేసులు జాతీయ కమిషన్ ఎదుట దాఖలు చేయవచ్చు
- వినియోగదారులు ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది.

ప్రజల్లో అవగాహన రావాలి



వినియోగదారుల చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తుండటంతో ప్రజలు నిత్యం మోసానికి గురి కావాల్సి వస్తోంది. ఎంఆర్‌పీకి మించి అమ్ముతున్నా.. పట్టించుకునే వారు లేకపోవడం దారుణం. జిల్లా కేంద్రంలో ఆహార పరీక్షల ల్యాబ్ ఏర్పాటు చేయాలని చాలాసార్లు విన్నవించాం.

– సురేశ్‌బాబు, వినియోగదారుల సంఘం సభ్యుడు, పుట్టపర్తి

నష్టపరిహారం కోరవచ్చు



నాణ్యత లేని ఉత్పత్తులపై (ప్రొడక్ట్ లైబిలిటీ) తయారీదారులు, విక్రయదారులు, సేవాదారులు అందరూ బాధ్యత వహించాలి. వినియోగదారులకు నష్టపరిహారం చెల్లించాలి. రెండు సంవత్సరాల కాల పరిమితికి లోబడి కమిషన్ ఎదుట ఫిర్యాదులు దాఖలు చేయవచ్చు. వినియోగదారుల్లో చైతన్యం రావాలి. అప్పుడే వినియోగదారుల రక్షణ చట్టం లక్ష్యం నెరవేరుతుంది.

– ఎం.శ్రీలత, జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు

రంగు రబ్బ.. రబ్బ

సాక్షిబృందం: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పల్లె, పట్టణం, ఊరూ, వాడా తేడాలేకుండా చిన్నా పెద్దా అందరూ రంగులు చల్లుకున్నారు. పాటలు పాడుతూ కేరింతలు కొడుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.




హిందూపురం పట్టణంలో రంగులు చల్లుకుంటున్న బాలికలు, హిందూపురం: చిన్నారుల సందడి

గరుడ వాహనంపై దేవ దేవుడు



గరుడ వాహనంపై దర్శనమిస్తున్న ఖాద్రీశుడు



ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

- భక్తులతో పోటెత్తిన నృసింహాలయం
- గోవింద నామస్మరణతో మార్మోగిన కదిరి

కదిరి: అశేష భక్త జన గోవింద నామస్మరణ మధ్య ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి శుక్రవారం గరుడ వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతున్ని నారసింహుడికి వాహనంగా పంపుతారని, అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మ గరుడ సేవ అంటారని అర్చక పండితులు అంజన్ కుమార్ ఆచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో సమస్త వాహనాల్లో సర్వ శ్రేష్టమైన గరుడ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే స్వర్గం ప్రాప్తిస్తుందని, బాధల నుంచి విముక్తి కల్గుతుందని భక్తుల నమ్మకం. నారసింహుని బ్రహ్మోత్సవాల సమయంలో ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికేది గరుత్మంతుడే కాబట్టి ఈ వాహన సేవకు ప్రాధాన్యత ఉంది.

రాజగోపుర దర్శనానికి పోటీ..

తమ ఇష్టదైవం ఖాద్రీశుడు తూర్పు రాజగోపురం వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా 'ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోవిందా..గోవింద' అంటూ భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. బ్రహ్మ గరుడ సేవలో తూర్పు రాజగోపురం వద్ద స్వామి వారిని దర్శించుకుంటే మరింత పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే భక్తులు తమ ఇలవేల్పు అయిన నృసింహుడిని అక్కడ దర్శించుకోవడానికి పోటీ పడ్డారు. విద్యుత్ దీపాలంకరణ, కదిరి మల్లెలతో శ్రీవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు ఉభయదారులుగా కుటాగుళ్లకు చెందిన బేరి వర్తకులు బీపీ నారాయణప్ప శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేడు శేష వాహనం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం (నేడు) లక్ష్మీ నారసింహుడు శేషవాహనంపై తన భక్తులకు తిరువీధుల్లో దర్శనం ఇవ్వనున్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన



కోలాటం ఆడుతున్న మహిళలు

• నేటి నుంచి ఒంటిపూట బడి

పుట్టపర్తి: నేటి నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నామని, ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ స్కూళ్లు పనిచేస్తాయని డీఈఓ కృష్ణప్ప తెలిపారు.

క్లుప్తంగా

రైలు కిందపడి వలస కార్మికుడి మృతి


మృతుడు ఇస్రార్

హిందూపురం అర్బన్: హిందూపురం–మలుగూరు రైల్వేస్టేషన్ మధ్య శుక్రవారం ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇస్రార్(35) హిందూపురం టీచర్స్ కాలనీలో ఓ బ్యూటీపార్లర్‌లో పని చేసేవాడు. సొంతూరుకు వెళ్లే క్రమంలో రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బ్యూటీపార్లర్ నిర్వాహకుడు సుధాకర్ నాయుడు సహకారంతో మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.

క్షుద్ర పూజలు చేశారంటూ వేధింపులు.. మహిళ ఆత్మహత్య

మడకశిరరూరల్: క్షుద్ర పూజలు చేశారంటూ వేధింపులకు గురిచేయడంతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పత్తికుంట గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప భార్య రత్నమ్మ అనారోగ్యంతో బాధపడుతుండేది. వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా నయం కాలేదు. అదే గ్రామానికి చెందిన నాగమణి(39) క్షుద్ర పూజ చేయించడంతోనే తన భార్యకు నయం కాలేదని అనుమానంతో హనుమంతరాయప్ప, కుటుంబ సభ్యులు నాగమణిని వేధించేవారు. ఈక్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె శుక్రవారం గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త నరసింహమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం


తీవ్రంగా గాయపడిన వలి

తనకల్లు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో వలి అనే వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు..నల్లచెరువు మండలం మల్లిరెడ్డిపల్లికి చెందిన వలి బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వలి మూడు రోజులుగా తనకల్లులో ఉంటున్నాడు. అయితే శుక్రవారం రాత్రి రైల్వేస్టేషన్ రోడ్డులోని మోరీ వద్ద ఉన్న వలిపై బైక్‌పై వచ్చి అగంతకులు కత్తులతో విచక్షణారహితంగా దాడికి పాల్పడి అక్కడి నుంచి పరారయ్యారు. అపస్మారక స్థితిలో రోడ్డుపక్కన పడిపోయాడు. ఎస్‌ఐ గోపి హుటాహుటినా బాధితుడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పట్టు వ్యాపారులకు.. ము(అ)ప్పుతిప్పలు



- ముచ్చెమటలు పట్టిస్తున్న షోరూంల నిర్వాహకులు
- ఏళ్ల తరబడి బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం
- ముగ్ధ షోరూం యాజమాన్యంపై రెండు చీటింగ్ కేసుల నమోదు


ధర్మవరంలోని నేసేపేట

ధర్మవరం: పట్టుచీరల షోరూంలు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నెలల తరబడి డబ్బు ఇవ్వకపోవడంతో సదరు షోరూంలపై కేసులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దేశంలో పట్టుచీరల విక్రయానికి ప్రముఖ వాణిజ్య కేంద్రం ధర్మవరం. ముఖ్యంగా పట్టణంలోని నేసేపేట నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకేగాక విదేశాలకు సైతం పట్టు చీరలు ఎగుమతి అవుతున్నాయి. అయితే నగరాల్లోని పట్టుచీరల షోరూంల నిర్వాహకులు పట్టు వ్యాపారుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. సిల్క్‌హౌస్ యజమానుల దగ్గర రోజూ రూ.లక్షల విలువైన పట్టు చీరలను కొనుగోలు చేయడం, ఆ తర్వాత నెలల తరబడి డబ్బు చెల్లించకుండా తిప్పుకోవడం పరిపాటిగా మారుతోంది. గతంలో రెండు, మూడు ప్రధాన షోరూంలు సైతం అప్పులు చెల్లించకుండా బోర్డులు తిప్పేశాయి. అదే కోవలోనే మరో ప్రముఖ పట్టుచీరల షోరూం సంస్థ 'ముగ్ధ' ధర్మవరంలోని పట్టు వ్యాపారులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. 'ముగ్ధ' మనోహరమైన చీరలు అమ్ముతామంటూ ప్రచారం చేసుకునే ఆ సంస్థ పట్టణంలోని నేసేపేటలో ఉన్న పలువురు వ్యాపారుల వద్ద కొన్నేళ్లుగా పట్టుచీరలను కొనుగోలు చేస్తోంది. మొదట్లో డబ్బు బాగానే చెల్లించినప్పటికీ ప్రస్తుతం వ్యవహరిస్తున్న తీరు మాత్రం వ్యాపార వర్గాల్లో ఆందోళన కల్గిస్తోంది.

రూ.కోట్లలో బకాయిలు..

ముగ్ధ షోరూం యజమానులు ధర్మవరం పట్టు వ్యాపారుల వద్ద పెద్దఎత్తున పట్టు చీరలను కొనుగోలు చేసి హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు తదితర నగరాల్లో పెద్ద షోరూంలు నిర్వహిస్తున్నారు. అయితే మూడేళ్ల నుంచి సిల్క్‌హౌస్ యజమానులకు బకాయిలు చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారు. బకాయిలు చెల్లించాలని పలుమార్లు షోరూం వద్దకు వెళ్లి అడిగినప్పటికీ స్పందన రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రూ.కోట్ల బకాయిలను ముగ్ధ షోరూం యజమానులు చెల్లించాల్సి ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

ముగ్ధ షోరూం యజమానిపై చీటింగ్ కేసులు..

ఈ నెల 6న దాసరి నాగభూషణం, ముక్తాపురం బాలకృష్ణ అనే ఇద్దరు వ్యాపారులు ముగ్ధ షోరూం యజమానులపై ధర్మవరం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు రూ.3.53 కోట్ల బకాయిలు చెల్లించకుండా మోసం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు ముగ్ధ ఎండీ వంగపల్లి శశిపై క్రైం నంబర్ 51/2025 యూ/ఎస్318(4)316(2) బీఎన్‌ఎస్, 52/2025 యూ/ఎస్318(4), 316(2)బీఎన్‌ఎస్ సెక్షన్‌ల కింద చీటింగ్ కేసులను నమోదు చేశారు.

షోరూం నిర్వాహకుల వితండ వాదం..

బకాయిలు అడిగితే ముగ్ధ షోరూం నిర్వాహకులు వితండవాదం చేస్తూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్లు వ్యాపారులు వాపోతున్నారు. 'మాకు హ్యాండ్‌లూమ్ చీరలు అని చెప్పి పవర్‌లూమ్ చీరలు ఇచ్చి మోసం చేశారు. మీ మీద కూడా కేసు పెడతాం' అంటూ బెదిరిస్తున్నట్లు తెలిసింది. దీంతో కొంత మంది వ్యాపారులు బకాయిలు అడగకుండా మౌనంగా ఉండిపోతున్నట్లు తెలుస్తోంది.

గతంలో బోర్డులు తిప్పేసిన షోరూంల నిర్వాహకులు..

గతంలోనూ లీలా కళానికేతన్ లాంటి కొన్ని షోరూంలు బోర్డు తిప్పేసి రూ.80 కోట్ల దాకా పట్టు చీరల వ్యాపారులకు ఎగ్గొట్టాయి. ఈ పరిస్థితి పునరావృతమైతే జరిగే నష్టం ఊహకందదని, చేనేత మనుగడే ప్రశ్నార్థకమవుతుందని చేనేత నాయకులు అభిప్రాయపడుతున్నారు.


వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం

- నిందితులు టీడీపీ కార్యకర్తలు


బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి తదితరులు

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం జంగాలపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాకర్తలపై టీడీపీ కార్యకర్తలు హత్యాయత్నం చేశారు. గురువారం రాత్రి బాలంపల్లి వైపు నుంచి వస్తున్న అశ్వర్థ, దేవేగౌడలపై మార్గ మధ్యంలో కాపుకాచిన టీడీపీ కార్యకర్తలు సాయికుమార్, శ్రీనివాసులు, గోవిందప్ప మారణాయుధాలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు వెంటనే హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి శుక్రవారం హిందూపురం జిల్లా సర్వజనాస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఫోన్ ద్వారా బాధితులను పరామర్శించారు. అనంతరం వేణురెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ టీడీపీ నేతల అరాచాకాలను ప్రోత్సహిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. పోలీసులు నిందితులను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా వ్యక్తిగత కక్షలే దాడులకు కారణమని, ఇరుపక్షాలపై కేసు నమోదు చేయనున్నట్లు సీఐ ఆంజనేయులు ప్రకటించారు.

ఈ భవనాసిని తీర్థమే ఒకప్పటి కోనేరు



కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఈశాన్య మూలలో ఉన్న ఈ భవనాసిని తీర్థంలోనే భక్తులు గతంలో స్నానమాచరించే వారు. భక్తులు తమ ఇలవేల్పు దేవుడు నారసింహుడికి తలనీలాలు సమర్పించిన మీదట ఇందులో స్నానం చేసిన అనంతరం స్వామివారిని దర్శించుకునేవారు. అయితే లోతైన బావి తరహాలో ఉండటంతో చిన్న పిల్లలు, మహిళా భక్తులు ఇందులోకి దిగి స్నానం చేయడం కష్టంగా ఉండేది. అందుచేత ఆలయ అధికారులు కొన్నేళ్లుగా ఇందులో స్నానం చేయడానికి భక్తులను అనుమతించడం లేదు. కాగా ఇందులో ఏర్పాటు చేసిన ఆంజనేయుడి విగ్రహం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.


భవనాసిని తీర్థం

కొట్టుకుపోయిన కోనేరు..

ఆలయానికి పడమటి వైపున అర్జున నదీ(మద్దిలేరు)తీరం ఉంది. అక్కడ భృగు మహర్షి తపస్సు చేసి స్వామి వారిని స్మరణం చేసుకున్నారు. ఆయన కోరిక మేరకు శ్రీవారు ప్రత్యక్షమై శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలను స్వయంగా అందించినట్లు బ్రహ్మాండ పురాణం చెబుతోంది. వాటినే ఏటా బ్రహ్మోత్సవాల్లో తిరువీధుల్లో ఊరేగిస్తున్నారు. వసంత రుతువులో శ్రీవారు అనుగ్రహించడంతో ఉత్సవ మూర్తులకు వసంత వల్లభులని పేరొచ్చింది. భృగు మహర్షి తపస్సు ఫలితంగా కోనేరును భృగుతీర్థం అని పిలుస్తున్నారు. అయితే 2022లో కురిసిన భారీ వర్షాలకు కోనేరు మొత్తం కొట్టుకుపోయింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉంది.

మరిన్ని తీర్థాలు..

శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా భృగుతీర్థం, భవనాసిని తీర్థాలతో పాటు మొత్తం 13 పవిత్ర తీర్థాలు ఉన్నట్లు బ్రహ్మాండ పురాణం ద్వారా తెలుస్తోంది. 1 గజేంద్ర తీర్థం, 2 ఆళ్వారుల తీర్థం, 3 అచ్యుత తీర్థం, 4 భృగుతీర్థం, 5 అర్జున తీర్థం, 6 శ్వేత పుష్కరిణి తీర్థం, 7 భవనాసిని తీర్థం, 8 గరుడ తీర్థం, 9 నాగుల తీర్థం, 10 కూర్మతీర్థం, 11 స్వర్ణతీర్థం, 12 శ్రీ తీర్థం, 13 క్షీర తీర్థం..ప్రస్తుతం దీన్ని పాలబావిగా పిలుస్తున్నారు.

వైభవంగా రొళ్ల లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం


రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం, (ఇన్‌సెట్) పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో శుక్రవారం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మరథోత్సవం వైభవంగా సాగింది. ఉదయాన్నే స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణ ముందు భాగాన ఉన్న రథాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. రథం ముందు భాగాన వేదపండితులు శాంతి, నవగ్రహ హోమం, యోగీశ్వరారాధన, గణపతి పూజ, బలిహరణ తదితర పూజలు చేశారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రధాన ఆలయం నుంచి మేళతాళాలతో ఆంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగించారు. అనంతరం అర్చకులు ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు రథంపైకి అరటి పండ్లు, పూలు, తమలపాకులు, బొరుగులు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామ స్మరణతో రథాన్ని ఆలయ ప్రాంగణం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు లాగారు. భక్తులకు దాతల సహకారంతో మూడు చోట్ల అన్నదానం చేశారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మడకశిర సీఐ రాజ్‌కుమార్ ఎస్‌ఐ వీరాంజనేయులు, అమరాపురం ఎస్‌ఐ ఇషాక్‌బాషాతో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు రొళ్లకొండ పై దివ్యజ్యోతి దర్శనం..

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం రొళ్లకొండ పై భాగాన వెలసిన ఉగ్రనరసింహస్వామి ఆలయంలో దివ్యజ్యోతి దర్శనం, వసంతోత్సవం, భక్తులతో ధాన్యం సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

కదిలింది.. కణివె నృసింహుడి బ్రహ్మరథం

పావగడ: స్థానిక కణివె లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎండోమెంట్ అధికారి, స్థానిక తహసీల్దార్ వరద రాజు సమక్షంలో ఆలయం నుంచి లక్ష్మీదేవి సమేత నరసింహస్వామి ఉత్సవ మూర్తులను వేద పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాల మధ్య అందంగా అలంకరించిన బ్రహ్మరథంలో ప్రతిష్ఠించారు. అనంతరం 12.45 గంటల సమయంలో ఎండోమెంట్ అధికారి వరదరాజు తదితర ప్రముఖులు లాంఛన ప్రాయంగా లాగి బ్రహ్మ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహస్వామి పాదాల గోవిందా గోవింద... అనే నామ స్మరణ మార్మోగింది. అనంతరం ఆలయం బయట నిలిపిన బ్రహ్మ రథానికి భక్తులు టెంకాయలు కొట్టి ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులకు భక్త మండలి పదాధికారులు అన్నదానం చేపట్టారు. సీఐ సురేశ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


భక్తుల నడుమ సాగుతున్న బ్రహ్మరథం

అవసరమైతేనే సిజేరియన్ చేయండి

కదిరి టౌన్: పట్టణంలోని మూర్తిపల్లి, నిజాంవలీ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి డాక్టర్ ఫైరోజ్ బేగం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. కదిరి ఏరియా ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ , లేబర్ వార్డును తనిఖీ చేశారు. ఏరియా ఆస్పత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆస్పత్రి తనిఖీలో భాగంగా శిల్పా నర్సింగ్ హోమ్‌ను తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్‌ను విజిట్ చేసి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడులో రౌడీ రాజ్యం

- చట్టాన్ని టీడీపీ చుట్టంగా మార్చుతున్న పోలీసులు
- ఏకపక్షంగా వెళ్తామంటే చూస్తూ ఊరుకోం
- రైతుల సమస్యలపై రాజీ పడను.. జైలుకు వెళ్లేందుకూ సిద్ధం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: మేము అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాప్తాడు నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయి. ఎక్కడా నిర్బంధాలు చేయలేదు. అనవసరంగా ప్రతిపక్ష పార్టీ వారిని పిలిపించి అక్రమ కేసులు బనాయించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి పరిటాల సునీత ఎమ్మెల్యే అయిన తర్వాత రౌడీ రాజ్యం నడుస్తోంద'ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నగర శివారులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు మండలం సిద్దరాంపురంలో కురుబ బాలన్న అనే యువకుడిని టీడీపీ వారు కట్టెలతో దాడి చేస్తే పరామర్శించడానికి వెళ్తానంటే పోలీసులు అనుమతులు ఇవ్వలేదన్నారు. సిద్ధరాంపురం ఏమైనా పాకిస్తాన్‌లో ఉందా? అందుకు ప్రత్యేక వీసాలు కావాలా? అని ప్రశ్నించారు. రామగిరి మండలం పోలేపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవానికి వెళ్తుంటే దాదులూరు వద్ద డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు వచ్చి అడ్డుకుని బందోబస్తు ఇవ్వలేమని పర్యటన వాయిదా వేసుకోవాలంటూ చెప్పారన్నారు.

పోలీసులు ప్రజల కోసమా.. సునీత కోసమా?

పోలీసులు ప్రజల కోసం పని చేస్తున్నారా? లేదంటే పరిటాల సునీత కోసం పని చేస్తున్నారా? అని మాజీ ఎమ్మెల్యే మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా లా అండ్ ఆర్డర్ కోసం పని చేస్తున్నారా? లేదంటే టీడీపీని బలపరిచేందుకు పని చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలేపల్లికి వస్తే పెద్దపెద్ద గొడవలు అవుతాయని రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ చెబుతున్నారని, ఆయన టీడీపీ ఏజెంటుగా పని చేస్తున్నారా? అని నిలదీశారు. ఊరిలో లేని సమస్యను సృష్టిస్తూ పోలీసు వ్యవస్థను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి ఆ గ్రామంలో టీడీపీ వాళ్లకు లేని ఉద్దేశాలను ఎస్‌ఐ కల్పిస్తూ ఎస్పీ, డీఎస్పీని తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. తమ పార్టీ నేతలు స్టేషన్‌కు వెళ్తే అగౌరవంగా మాట్లాడటడంతోపాటు కింద కూర్చోమని చెబుతారని ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌పై మండిపడ్డారు.

సీఐ, ఎస్‌ఐలు పద్ధతులు మార్చుకోవాలి..

అనంతపురం రూరల్ మండలంలోని తమ పార్టీ నేతలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. పుట్టపర్తిలో జరిగిన యువత పోరు కార్యక్రమానికి పెద్ద ఎత్తున వాహనాల్లో వెళ్లడంతో వారికి కళ్లు ఎర్రబడ్డాయన్నారు. జనాలను బాగా పిలుచుకెళ్లిన లీడర్లను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని టీడీపీ చుట్టంగా మార్చొద్దని పోలీసులకు హితవు పలికారు. తాను గుండీలు ఇప్పుతా రా కొట్లాడదామని రాప్తాడు సీఐ పిలుస్తారని, ఆయన సీఐనా రౌడీనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరులో లాఅండ్ ఆర్డర్ సమస్యంతా ఇటుకలపల్లి సీఐతోనే ఉత్పన్నమవుతోందన్నారు. తోపుదుర్తిలో 30 మంది ఇంట్లోకి దూరి మహిళపై దాడి చేస్తే..బాధితులపైనే కేసు కడతాడన్నారు. వారి ఆగడాలు చూస్తూ ఊరుకున్నారంటే తాము సంయమనం పాటించమని చెప్పడమే కారణమనేది గుర్తు పెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా ఇటుకులపల్లి, రాప్తాడు సీఐలు, రామగిరి ఎస్‌ఐ పద్ధతులు మార్చుకోవాలని హితవుపలికారు.

చంద్రబాబు, సునీత చరిత్రహీనులుగా నిలిచిపోతారు..

లైనింగ్‌పనులు జరిగితే రాప్తాడు నియోజకవర్గంలో లక్షల ఎకరాలు బీళ్లుగా మారే ప్రమాదం ఉందని, దీనిపై రైతులను చైతన్యం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ పనులు జరిగితే చంద్రబాబు, పరిటాల సునీత చరిత్ర హీనులుగా నిలిచిపోతారన్నారు. నియోజకవర్గ రైతుల సమస్యలపై రాజీ పడబోనని, జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధమన్నారు. సిద్ధరాంపురం గ్రామానికి చెందిన బాధితుడు కురుబ బాలన్నను పరామర్శించడానికి వెళ్లనీయకపోవడంతో ఇక్కడికే బాధితుడిని పిలిపించి మీడియాకు చూపించారు. అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్రకుమార్, ఆత్మకూరు ఎంపీపీ హేమలత, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నేత కురుబ నాగిరెడ్డి, ఆత్మకూరు మండల కన్వీనరు బాలపోతన్న, నాయకులు నీరుగంటి నారాయణరెడ్డి, రామగిరి కన్వీనర్ మీనుగ నాగరాజు పాల్గొన్నారు.

చేనేత వ్యాపారుల భూమి కబ్జాకు 'తమ్ముళ్ల' యత్నం

- కంచె ధ్వంసం చేసి బెదిరించారన్న వ్యాపారులు


తొలగించిన కంచెను చూపుతున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: తమ భూమిని టీడీపీ నేతలు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చేనేత వ్యాపారులు వాపోయారు. పట్టణంలోని తారకరామాపురంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కనున్న సదరు భూమిలో శుక్రవారం వారు సమావేశం నిర్వహించారు. వ్యాపారులు పోలా వెంకటనారాయణ, పోలా ప్రభాకర్ మాట్లాడుతూ 2005లో 3.15 ఎకరాలు కొనుగోలు చేసి మగ్గాలు పెట్టామన్నారు. 2014లో కోర్టు కమిషనర్ ద్వారా సర్వే చేయించి కంచె వేయించామన్నారు. ఈనెల 5న టీడీపీ నేత కొత్తపేట ఆది, అతని అనుచరులు పది మంది వచ్చి జేసీబీతో భూమి చుట్టూ ఉన్న కంచెను తొలగించి దౌర్జన్యం చేశారన్నారు. బీరుసీసాలతో వచ్చి పొడిస్తే మీకు దిక్కు ఎవరంటూ బెదిరించారని తెలిపారు. దీనిపై పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకువెళ్లామని, తమకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారన్నారు. భవిష్యత్తులో చేనేతల జోలికి ఎవరొచ్చినా తిరగబడతామని హెచ్చరించారు. పట్టుచీరల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు గిర్రాజు రవి, మహిళా నేత జయశ్రీ, తొగటవీరక్షత్రీయ సంఘం అధ్యక్షుడు రాము, చేనేత ప్రముఖులు గద్దం శ్రీనివాసులు పాల్గొన్నారు.